# దిల్షాద్

బిన్‌లాడెన్ వొక క్రోమోజోమును

వెదుక్కుంటున్నాడేమో అప్పుడు

జీనా యహా మర్‌నా యహా అంటూ

వొక లీనా చంద్రావర్కర్ మేని సన్నల్లోకి

జారి పోవడానికి

నర్గీస్ కపూర్‌ల తపోచింతనలు

అంతా

శరీర నిర్వాణం

నిశ్శరీర సమాధి

వంకెర కత్తులు కట్టె తుపాకులు

భట్టి విక్రమార్కులు

బొక్కలతో అల్లిన ముగ్గులు

మాయా పల్లకీలు

కాంతి కనుమూయగానే తెర లేచును

చీకటి గాలిలోనే సత్యం అగుపించును

తథాగతుడా రహమతలీ

మహాబోధీ

ఇదెక్కడి వింతరా విచిత్రాకారా

తెలుపూ నలుపుల పచ్చీసాట

కలలకాటు

మెదడులో పాములు కస్సున లేచును

నిచ్చెనలంటును

రహస్యం రగులును

జమ్రుద్ ప్లాజా ప్రభాత్ రాత్రులన్నీ

ప్రార్థనా స్థలాలు

టాకీసే మా వేకువ కంజిర

ఖాజామియా నారాయనా

ఏంజేస్తున్నవురా జార్జి విల్సన్

చారాన టికెటుండెడిది

చంద్రకలా పేరుండెడిది

రీలు మార్చుడుండెడిది

వుస్కెలో నిద్రలు

తడ్కెలతో గోడలు

ఆరని బీడీలు ఆవిరి పాదాలు

ఉండెడివీ... ఉండెడివీ...

వీడదా బాధ తప్పిపోదా

అల్విదా వుందా

తార్కొవిస్కీ నుంచి ఆంజిలో పౌలిస్‌ల దాకా

ఈ అడవిలో వొదిల్నరేందిరా

గుక్కతిప్పుకోని నిద్రరాని తనమేందిరా

మిడ్‌నైట్‌షోలతో భూకైలాసం

పొగ్గులు పొడిచి అమ్మతల్లైంది

కడుపులోన

కంఠంలోపల కత్తి మొలిచింది

యాదోంకి బారాత్

మీనాకుమారీ మధుబాలా యల్విజయలక్ష్మీ

కిష్టగాడి ఫైటూ కూలిపొయ్యిందెల్లమ్మా కాంప్లెక్సయ్యింది

ఏది వినబడదు

డాల్బీ డాల్బీ

ఏది రుచియించదు

పాపం జేసిన తప్పుగాయి

వొక్కసారంటె వొక్కసారే...

పిండం మర్లెయ్

*(దిల్షాద్ కూలిన టాకీస్ మాత్రమే కాదు)*

సిద్ధార్థ

('బొమ్మలబాయి' – 29.11.1999)